క్లుప్తంగా

వివాహ వేడుకకు హాజరు



వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, మేడిపల్లి సత్యం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యక్తిగత భద్రత సిబ్బంది గడ్డమీది రాజశేఖర్ వివాహానికి సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మంత్రితోపాటు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఉన్నారు.

ప్రభుత్వ విప్‌కు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లిలో ఈనెల 28న జరిగే పెద్దమ్మ – పెద్దిరాజుల కల్యాణ మహోత్సవానికి రావాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సారంపల్లి ముదిరాజ్ సంఘ సభ్యులు సోమవారం ఆహ్వానపత్రిక అందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ యూత్ జిల్లా నాయకుడు రాజు, సారంపల్లి ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



మాట్లాడుతున్న ఎంఈవో దూస రఘుపతి

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని సిరిసిల్ల ఎంఈవో దూస రఘుపతి అన్నారు. కుసుమ రామయ్య పాఠశాలలో పనిచేసి పదవి విరమణ పొందిన పురుషోత్తం అనే ఉపాధ్యాయుడిని సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్, నెహ్రూనగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాగ్యరేఖ, విశ్రాంత జిల్లా ఉప విద్యాధికారి మల్లారపు రఘుపతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

వేములవాడ రూరల్: సీఈఐఆర్ పోర్టల్ గురించి ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వేములవాడ రూరల్ ఎస్సై మారుతి అన్నా రు. మండల పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించారు. ఎస్సై మాట్లాడు తూ సెల్‌ఫోన్ పోయినట్లయితే (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్) లో పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చన్నారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన లక్ష్మణ్ నాయక్, స్తంభంపల్లికి చెందిన మ హేశ్‌కు సెల్‌ఫోన్ అందించినట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కేసీఆర్ కాలనీలో అశ్విని ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి సమస్యతో బాధపడుతున్న 85 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమున్నవారు శస్త్రచికిత్స కోసం ఆస్పత్రికి రావాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యుడు అభినయ్, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటకు చెందిన అవధూత శ్రీనివాస్ తన తల్లిదండ్రులు అవధూత ఎల్లయ్య-రాంబాయిల జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేశాడు. వేసవి కావడంతో సిరిసిల్ల-కోనరావుపేట ప్రధాన రహదారి పక్కన చిన్న షెడ్డు ఏర్పాటు చేసి వాహనదారుల, ప్రజల దాహార్తిని తీర్చుతున్నాడు.

కల్వర్టుకు మరమ్మతు ఎప్పుడో?

- శిథిలమై ప్రమాదకరంగా రామన్నపేట – కొలనూర్ కల్వర్టు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



శిథిలమైన కొలనూర్ - రామన్నపేట కల్వర్టు

కోనరావుపేట: మండలంలోని రామన్నపేట-కొలనూర్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు శిథిలమై ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆయాగ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రెండేళ్ల క్రితం వర్షాలకు..

జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సొంత గ్రామమైన రామన్నపేట, కొలనూర్ గ్రామాల మధ్య ఉన్న ఈ రోడ్డు రెండు గ్రామాల ప్రజలకు ప్రధానమైనది. రామన్నపేట గ్రామస్తులు సిరిసిల్ల జిల్లా కేంద్రానికి, కొలనూర్ గ్రామానికి వెళ్లాలంటే ఇదొక్కటే రహదారి. రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు కల్వర్టు దెబ్బతింది. ఒకవైపు పగుళ్లు ఏర్పడటంతో ప్రమాదకరంగా మారింది.

జిల్లా కేంద్రానికి దగ్గరగా..

రామన్నపేటతో పాటు సుద్దాల, మంగళ్లపల్లి, పల్లిమక్త గ్రామాల ప్రజలు సిరిసిల్లకు వెళ్లాలంటే రామన్నపేట-కొలనూర్ గ్రామాల మధ్య రహదారి గుండా వెళ్లాలి. నాగారం ప్రజలు కూడా ఇదే దా రిగుండా సిరిసిల్లకు వెళ్లాలి. గ్రామాల ప్రజలు, వాహనదారులకు ముఖ్యమైన రహదారిపై జెడ్పీ చైర్‌పర్సన్ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

మరమ్మతు చేపట్టాలి



రామన్నపేట గ్రామం నుంచి సిరిసిల్లకు వెళ్లాలంటే కొలనూర్ గ్రామం నుంచే వెళ్లాలి. ఒకవైపు మొత్తం పగలడంతో ఒకే వైపు నుంచి వాహనాలు వెళ్తున్నాయి. ప్రస్తుతం ధాన్యం లోడ్‌తో వాహనాలు వెళ్లడం కష్టంగా మారింది. మళ్లీ వర్షాకాలం వస్తే సమస్యలు వస్తాయి. అంతలోపే కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి.

– నేతుల దేవరాజ్, మాజీ సర్పంచ్

ప్రతిపాదనలు పంపాం

కోనరావుపేట మండలంలోని రామన్నపేట గ్రామం నుంచి కొలనూర్ గ్రామల మధ్య ఉన్న కాజ్‌వే వర్షాలకు దెబ్బతింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రూ.50 లక్షలతో కొలనూర్-రామన్నపేట గ్రామాల మధ్య వంతెన కోసం ప్రతిపాదనలు పంపించాం. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నిధులు మంజూరైతే పనులు జరుగుతాయి.

–పవనకుమారి, డీఈ, పంచాయతీరాజ్

ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలకు రండి



కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలో ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలకు హాజరుకావాలని సోమవా రం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు గౌడ సంఘం నాయకులు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 30 నుంచి గ్రామంలో మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మెరుగు రాజేశంగౌడ్, బాలరాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రఘుపతిగౌడ్, యాదగిరి, కిషన్, సతీశ్ తదితరులున్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం



మల్లన్న పట్నం వద్ద నాయకులు, ఒగ్గు పూజారులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మల్లికార్జున స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం పుట్ట బంగారం తీసుకొచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఒగ్గు పూజారులు మల్లన్న పట్నాలు వేసి భక్తుల సమక్షంలో కల్యాణం జరిపించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుల్లపల్లి నర్సింహారెడ్డి, యాదవ సంఘం అధ్యక్షుడు ఉల్లి బాలయ్య, సంఘం సభ్యులు, మహిళలు, నాయకులు శరవింద్, గోపాల్, బత్తిని శ్రీనివాస్, ఆంజనేయులు, ఉల్లి బాబు, నాగరాజు, మహేశ్, పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన



బోయినపల్లి: నృత్యం చేస్తున్న విద్యార్థులు



వేములవాడ రూరల్: ఫాజుల్‌నగర్‌లో..

బోయినపల్లి: మండలంలోని గుండన్నపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థులు నృత్యం అలరించింది. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు కార్యక్రమంలో నాయకులు కొప్పుల స్వామి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఎంతగానో అలరించాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు రామస్వామి, కనకలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు చోరీ



కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల గ్రామ శివారులో ఉన్న పల్లెప్రకృతి వనంలో హైమాస్ట్ లైట్లను కొన్నిరోజుల క్రితం ఏర్పాటు చేశారు. కాగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకముందే హైమాస్ట్ స్తంభానికి ఉన్న లైట్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గ్రామశివారు ప్రాంతం కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలుపుతున్నారు. లైట్లు ఎత్తుకెళ్లిన వారిని గుర్తించి, తిరిగి ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో ధాన్యం దొంగ

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు నిల్వచేసిన ధాన్యాన్ని అపహరించిన సంఘటనలో సోమవారం ఓ దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులు నిల్వచేసిన ధాన్యం రాశుల్లో నుంచి దాదాపు ఐదు కింటాళ్ల ధాన్యం దొంగతనం చేసి దన కుప్పలో కలుపుకున్నట్లు గుర్తించిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సదరు దొంగను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా ఇదే వ్యక్తి గతంలో ద్విచక్ర వాహనాలు, జేసీబీల బ్యాటరీలను అపహరించిన సంఘటనలో పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



భూసార పరీక్ష నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో సోమవారం బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు భూసార ప రీక్షలపై అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరంలో భాగంగా భూసార పరీక్షలు ఎలా నిర్వహించాలి, మట్టి నమూన ఏ విధంగా సేకరించాలో రైతులకు వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.అరుణ్ బాబు, కె.భవ్యశ్రీ, వ్యవసాయ విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరీంనగర్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



ముస్తాబాద్: కరీంనగర్‌కు వెళ్తున్న నాయకులు

ముస్తాబాద్: కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు సోమవారం నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆరుగ్యారంటీలను అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, నాయకులు కొండం రాజిరెడ్డి, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింలు, నరేశ్, దేవిరెడ్డి, భాను, ప్రశాంత్, కరుణాకర్, మోహన్‌రెడ్డి, రమేశ్, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాలి రాజేందర్‌రావు నామినేషన్ ప్రక్రియకు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్దిలక్ష్మారెడ్డి, బండారి బాల్‌రెడ్డి, రాజేందర్, రాజయ్య, దత్తాద్రి, చెన్ని బాబు, రాంరెడ్డి, శ్రీను, తదితరులున్నారు.

టాస్క్ కోర్సులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దీప

తంగళ్లపల్లి: తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులకు సోమవారం టాస్క్ సంస్థ రీజనల్ మేనేజర్ దీప ఆధ్వర్యంలో టాస్క్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దీపా మాట్లాడుతూ టాస్క్ ద్వారా అందిస్తున్న వివిధ కోర్సులు, ఇంటర్న్‌షిప్స్ గురించి వివరించారు. జూన్ నుంచి కొత్త కోర్సులు ప్రారంభమవుతాయని సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ రజని, వైస్ ప్రిన్సిపాల్ సుధా సింధు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



పుస్తెమెట్టెలు అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌కు చెందిన నాగెల్లి సుధాకర్, చంద్రవ్వ దంపతుల కూతురు భవాని వివాహానికి ఎంపీపీ జనగామ శరత్‌రావు సోమవారం పుస్తెమెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నిమ్మ రాజిరెడ్డి, బాలాగౌడ్, ఆదర్శ్, సోహైల్, నాగెల్లి దేవయ్య, బాబు, బాల్‌రెడ్డి, దేవాగౌడ్, మల్లేశ్, కృష్ణ, చారి, సతీశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో రైతులు



వీర్నపల్లి: ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పిన రైతులు



రుద్రంగిలో ధాన్యంపై టార్పాలిన్ కప్పిన రైతులు

రుద్రంగి: పలుచోట్ల అకాలవర్షాలు పడుతుండటంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడుస్తుందేమోనని మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారంరోజుల వరకు కోతకు వచ్చే పంటపొలాలను సైతం భయంతో ముందుగానే కోస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం వచ్చినా తూకం వేయకపోవడంతో కొందరు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరగా తూకం వేసి తమ ఇబ్బందులు తీర్చాలని వారు కోరుతున్నారు.

వీర్నపల్లి: మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా తూకం వేయకపోవడంతో చేతికొచ్చిన ధాన్యం అకాలవర్షానికి తడిసిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉండటం, ఈదురు గాలులు వీస్తుండటంతో ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పలు పోసి టార్పాలిన్లను కప్పుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

‘మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం’



మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: దేశంలో మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు రవీందర్‌నాయక్, భాస్కర్‌నాయక్, ప్రకాశ్‌నాయక్ అన్నారు. హుస్నాబాద్ బీజేపీ ఎస్టీ మోర్చా సమావేశానికి వెళ్లే ముందు మండలకేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్‌ను ప్రజలు మరోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. భూక్య రమేశ్, పుల్యానాయక్, దేవేందర్‌నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లికి చెందిన నెత్తెట్ల చిన్న మల్లయ్య అనే రైతు ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు సోమవారం పరామర్శించారు. ప్రభుత్వం రైతుబీమాతోపాటు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి,సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుల్లపల్లి నర్సింహారెడ్డి తదితరులున్నారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లో శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మరింగంటి పురుషోత్తం, శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, స్వామివారికి అష్టాభిషేకం, అలంకరణ చేశారు. పుష్పార్చన, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. గణపతి, సుబ్రహ్మణ్యం పూజ, పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం పదునెట్టాంబడి పడిపూజ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు పందిళ్ల సుధాకర్‌గౌడ్ అల్పాహారం అందించారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారులతోపాటు కంచర్ల, ఎల్లారెడ్డిపేట, గొల్లపల్లి, బొప్పాపూర్, సిరిసిల్ల, వేములవాడ గురుస్వాములు, అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ ఆలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మారుతి తెలిపారు. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నేడు స్వామివారికి సంకల్పం, అభిషేకం, స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకం, నిత్యహవనం, పూర్ణాహుతి, బలిహరణం, సాయంత్రం రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గర్భిణులకు సీమంతం



బోయినపల్లి: మండలంలోని కోరెం గ్రామ రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. పిల్లలకు ప్రోగ్రెస్(ప్రగతి) కార్డులు అందించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరుల పాదయాత్ర



కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్న దీక్షాపరులు

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన పలువురు హనుమాన్ దీక్షాపరులు హనుమాన్ జయంతిలో పాల్గొనేందుకు సోమవారం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయానికి పాదయాత్రగా బయలు దేరారు. భజనలు, అంజన్న కీర్తనలు, మేళ తాళాలతో భక్తులు సుమారు 35 కిలోమీటర్ల మేర నడకదారిలో కొండగట్టుకు తరలివెళ్లారు.